జిందగీ
చైతన్య
నమస్తే తెలంగాణ హైదరాబాద్
సోమవారం 2 డిసెంబర్ 2024
www.ntnews.com
11

సమదృష్టి సాధ్యమా?

ఆత్మౌపమ్యేన సర్వత్ర సమం పశ్యతి యోఽర్జున
సుఖం వా యది వా దుఃఖం స యోగీ పరమో మతః!
(భగవద్గీత 6-32)

'చరాచర ప్రకృతిలోని సకల జీవులను తనతో సమంగా భావిస్తూ, తనలో దర్శిస్తూ, ఇతరుల కష్టసుఖాలకు సహృదయంతో స్పందించేవారిని, పరమ యోగులుగా పరిగణిస్తాను' అంటాడు కృష్ణపరమాత్మ. వ్యక్తి ఎలాగైతే శరీరంలోని అవయవాలను తనవిగా భావిస్తూ అన్నిటినీ సమానంగా ఆదరిస్తాడో, అలాగే తన అంశ అయిన అన్ని జీవరాసులనూ పరమాత్మ సమంగానే చూస్తాడు. పరమాత్మలాగే పరమయోగులూ ప్రపంచంలోని ప్రతి జీవినీ సమదృష్టితో దర్శిస్తారు. జీవకోటి శ్రేయస్కరమైన మార్గంలో తరించాలనీ తపిస్తారు.

గీతావాక్యం

'సమం పశ్యతి' అంటే సమదర్శనం. సృష్టిలో ఒకే విధంగా జనించని అందరినీ సమంగా దర్శించడం సాధ్యమా? ఒక్కొక్కరి బలాలు, బలహీనతలు వేరువేరుగా ఉంటాయి. అలాంటప్పుడు అందరినీ సమదృష్టితో ఆదరించాలి అనడం వినడానికి బాగుంటుందేమో కాని ఆచరణలో సాధ్యమా? నిజానికది చూసేవారి దృష్టికోణమే కాని, చూడబడేవారికి సంబంధించినది కాదు! కాబట్టి అసాధ్యం కాదు.. సాధన చేస్తే సమదృష్టి అలవడడం జరుగుతుంది.

వ్యక్తిలో భౌతిక ఆధ్యాత్మిక పార్శ్వాలలో జాత్యంతరీకరణ జరగాలి. జాతి అంటే స్థాయి. నిజానికి వ్యక్తుల సాధనలో వారి స్థాయిని బట్టి వారి దృష్టి పరిణతి చెందుతుంది. భౌతిక దృష్టికోణంతో పరిశీలిస్తే.. 'నేను నాది, నీవు నీది' అనే భేదభావం కలుగుతుంది. స్థాయి కొంత ఉన్నతమైతే ఎదుటివారిని భౌతికంగా కాకుండా ఆత్మగా భావిస్తాం. భేదమనేది భౌతికమే కాని ఆత్మపరంగా లేదనే సత్యం అవగతమైతే జాతి మత స్థాయి భేదాలకు ప్రాధాన్యం లేకుండా అందరినీ ఒకే దృష్టితో చూస్తాం.

స్థాయిని మరింత పెంచుకున్న సాధకులు అందరిలోనూ పరమాత్మను దర్శించగలుగుతారు. అయితే వారు కూడా భౌతిక జగత్తును పట్టించుకుంటారు.. కాకపోతే ఫలితాలపై ఉదాసీన వైఖరితో కర్మలను ఆచరిస్తారు. సమాజంలో మంచిని మాత్రమే స్వీకరించి చెడును వదిలేస్తారు. పరమయోగులు అత్యున్నత స్థాయికి చెందినవారు. వారంతటా భగవంతుడిని దర్శిస్తుంటారు. ఏ స్థాయి వ్యక్తులకైనా కర్మాచరణ తప్పనిసరి. అయితే స్వీయ క్రమశిక్షణ, ధ్యానాది కర్మల ద్వారా అంతర్గత శాంతిని సాధిస్తూ.. ప్రక్రియ ఆధారంగా పనిచేసే వ్యక్తి పనిని ఆస్వాదిస్తూ, పనిని ఉపాసనా మార్గంగా మలుచుకుంటాడు. అతనిలో జరిగే జాత్యంతరీకరణ వ్యక్తిని ఉన్నతీకరిస్తుంది. ఫలితం ఆశించిన వ్యక్తి ఫలితానికి బంధీ అవుతాడు. పరమయోగిని నాయకుడిగా చెప్పుకొంటే, నాయకుడు సహచరులందరినీ సమదృష్టితో చూడాలి. అందరూ ఉన్నతమైన జీవితాన్ని అందుకోవాలని భావించాలి. 'సమం పశ్యతి' అనే మాటకు అర్థమిదే. నేటి సమాజం స్వార్థమే పరమావధిగా అభివృద్ధి చెందుతున్నది. ప్రజల అవసరాలు, అంచనాలు మారుతున్నాయి. భౌతిక ప్రగతికే పట్టంగడుతూ ఫలితాపేక్షకు బంధీలైన నాయకులు పరిణతి సాధించలేరు. ప్రజల శ్రేయసు లక్ష్యంగా పనిచేసే నాయకుడిని పరమయోగిగానే పరిగణించాలి. నాయకుడి దక్షతకది పరీక్షే! ఎన్నో సవాళ్లు పలకరిస్తున్న సమయంలో తీసుకునే నిర్ణయాలలో సమత్వం పాటించగలడా? స్వీయ-అవగాహన కలిగిన నాయకులు వ్యక్తిగత ప్రగతితోపాటు ఆధ్యాత్మిక సుగతికీ ప్రాధాన్యమిస్తారు. దానితో నాయకులు మరింత ప్రభావవంతంగా పని చేయడమే కాకుండా నిరంతర అభివృద్ధి కోసం తమ బృందాలకు ప్రేరణనిస్తారు.

నాయకుడిలో సమదృష్టి వల్ల బృందం పనితీరు ఉదాత్తతను సంతరించుకుంటుంది. అంతర్ దృష్టి ఆవిష్కృతమై వైఖరి మారుతుంది. క్రమశిక్షణ జీవితంలో భాగమవుతుంది. ఆధ్యాత్మిక పురోగతితోపాటు వృత్తిపరమైన విధులను సమతుల్యం చేయడం ద్వారా నాయకులు ఆధునిక కార్యాలయాలలోని సంక్లిష్టతలను అధిగమించగలుగుతారు. తోటివారిని ఉన్నతీకరిస్తూ తనను తాను ఉన్నతీకరించుకునే నాయకులు భౌతిక సంపదను సృష్టించడమే కాక ఆధ్యాత్మికంగానూ ఎదుగుతారు. అదే పరిణతి చెందిన నాయకత్వానికి సూచిక అవుతుంది. అలాంటి వారే పరమయోగులుగా ఆదర్శమూర్తులు అవుతారు.

... పాలకుర్తి రామమూర్తి

మీ పాదల మాటున లేడు గదమ్మ చెప్పరే?

రాసలీలా వైభవం-5

బాదరాయణి- శుకముని అవనీ (భూ) జాని విష్ణురాతునితో- రాజా! భ్రాంత- ప్రేమోన్మత్తలైన గోపకాంతలు పొంకం- సొగసుగా ఇరువంకల పరికిస్తూ ఆ అకలంకుని- హరిని గురించి ఇంకా ఇలా పడిపడి అడిగారు..

ఉ॥ 'నల్లనివాడు పద్మనయనంబులవాడు కృపారసంబుపై జల్లెడివాడు మౌళి పరిసర్పిత పింఛమువాడు నవ్వు రా జిల్లెడు మోమువాడొకడు చెల్వల మానధనంబు దెచ్చె నో మల్లియలార! మీ పొదల మాటున లేడు గదమ్మ చెప్పరే?'

'ఓ మల్లె తీవలారా! నల్లనివాడు, కమలాల వంటి కన్నులు కలవాడు, దాసులపై అపార కృపారసం కురిపించి మురిపించువాడు. సిగపై తురగలించు- ప్రకాశించు మురిపాల నెమలి పురి కలవాడు, మందహాసం చెన్నొందు అందమైన మోము కల ఒక 'చిన్న మగవాడు'- నగధీరుడు మా మగువల మానధనం కొల్లగొట్టాడు. సదయ హృదయలారా! మీ పొదల మాటున లేడు గదా! ఉంటే చెప్పరా?

నల్లనివాడు.. 'మేఘశ్యామం'- నీలాంబుద శ్యామల కోమలాంగుడు. మేఘం క్షారజలం- ఉప్పునీరు గ్రహించి క్షీరం లాంటి తియ్యని మంచినీరు పంచి పెడుతుంది. భగవంతుడు బాలకృష్ణుడు పూతన నుంచి విషం స్వీకరించి ప్రతిగా ఆ బాలఘాతినికి పీయూషం- ముక్తి రూప అమృతం అనుగ్రహించాడు. 'అమృతం చైవ మృత్యుశ్చ సదసచ్చాహమర్జున'- 'అమృతమూ నేనే, అంతమూ నేనే. సత్తు అసత్తూ కూడా నేనే' అని భగవద్వాణి! నీల వర్ణం అనంతత్త్వానికి ప్రతీకం. అంతులేని ఆకాశం నీలం! అపారమైన అంబుధి- సాగరం నీలం! పద్మనయనంబులవాడు.. పద్మం సృష్టికి, అసంగత్వానికి సంకేతం. తుదిలేని సృష్టులే ఆదిదేవుని- అనాది నిధనుని కదిలే కడగంటి చూపులు! పరమాత్మ విలాసంగా తిప్పే చూపుల్లోంచి అనేక కోటి బ్రహ్మాండాలు రూపుదిద్దుకుంటాయి. సృష్టి స్థితి లయాలు లీలలు. కాన, ఆయన అకర్త, అసంగుడు, నిర్లిప్తుడు! 'పద్మపత్ర మివాంభసా'- 'అనాసక్తితో కర్మలాచరించువానికి తామరాకుపై నీటి బిందువుల వలె పాపాలు అంటవు' అని గీత. నెమలి పింఛం అనాది బ్రహ్మచర్యానికి చిహ్నం. మానవులకు పిచ్చెత్తించే మాయా విశేషాలే మాధవుని నవ్వులు.

ఉ॥ 'అంగజునైన జూడ హృదయంగముడై కరగించు వాడు శ్రీ రంగదురంబు వాడు, మధురంబగు వేణురవంబు వాడు మ మ్మంగజు పువ్వు చూపులకు నగ్గము సేసి లవంగ లుంగ నా రంగములార! మీ కడకు రాడు గదా! కృప నున్న జూపరే!'

ఓ లవంగ వృక్షములారా! లుంగ- మాదీఫల మహీజములారా! నారంగ- నారింజ తరువులారా! చూచినంత మాత్రాన మదికి ఇంపు గొలిపి మదనుని కూడా కరగించేవాడూ, శ్రీవత్సాంకుడు- ఉరమున సిరి గలవాడూ, మధురమైన వేణు రవముల వాడూ అయిన కరి వరదుడు హరి మమ్ములను అసమశరుని- మన్మథుని కుసుమ బాణాలకు గురిచేసి మీ దరికి వచ్చి దాగలేదు కదా! వస్తే మాకు దయతో చూపండమ్మా! చెలువారే కలువపూల వలపుల నెత్తావులు వెలవరిస్తూ చవులూరించే పైరెండు మహత్తర వృత్తాలు పోతన కవి చిత్త సంజాతాలు.

నీ॥ 'మానినీ మన్మథు మాధవు గానరే
సలలితోదార వత్సకములార!
సలలితోదార వత్సక వైరి గానరే
సుందరోన్నత లతార్జునములార!
సుందరోన్నత లతార్జునభంజు గానరే
ఘనతర లసదశోకంబులార!
ఘనతర లసదశోకస్ఫూర్తి గానరే
నవ్యరుచిర కాంచనంబులార!
ఆ॥ నవ్యరుచిర కాంచన కిలీటు గానరే
గహన పదవి కురవకంబులార!
గహన పదవి కురవక నివాసి గానరే
గణికలార! చారు గణికలార!

కమనీయాలూ, కరుణా భరితాలూ అయిన కుటజ- కొండమల్లె కుజము (వృక్షము)లారా! మగువల పాలిటి మన్మథుడైన మాధవుని కన్నారా? కమ్మని కొమ్మలతో కొమరారు (అందగించు) మద్ది మ్రానులారా! ముద్దులు మూటగట్టు హద్దులెరుగని అందగాడు, వదాన్యుడు, వత్సాసుర సంహారి అయిన శౌరిని కనుగొన్నారా? కమనీయమైన కంకేళి భూజ- వృక్షములారా! కడు రమణీయమైన నిడుపైన కొమ్ములు గల యమళార్జునాలను- మద్దిచెట్లను భంజించిన కంజనేత్రుని, కుంజ విహారిని సందర్శించారా? ఇంపుసొంపుల కాంచన- సంపెంగలారా! వగ (దుఃఖం) లేక వెలుగు అగ (గోవర్ధన)ధరుని- పన్నగశాయిని వీక్షించారా? గణిక- ఓ అందమైన అడవి మొల్లలారా! చారు గణిక- సుందరమైన నెల్లి చెట్టులారా! బృందావనంలో కనువిందు చేసే నంద కిశోరుని- గోవిందుని గమనించారా?

శుకుడు- రాజా! ఇలా మధుర గుణ, స్వభావ సింధువైన లోక బంధువు మాధవుని వైభవాన్ని భావ బంధురంగా కీర్తిస్తూ బృందావనంలోని వివిధ వనాలలో- అరణ్యంలో వెదికారు. మూలాన్ని అతిక్రమించి 'సహజ పండితుడు'గా వినుతి వహించిన పోతన వెలయించిన ఆపాత మధురాలైన ఇట్టి అనేక అమూలక పద్యాలు నిసర్గమైన ఆయన సర్వంకష కవితా విద్యకు నికషోపలాలు- గీటురాళ్లు.

గోప వనితలు ఇంకా ఇలాగని ప్రశ్నించారు.. ఓ తులసీ! నీవు హరికి ప్రియురాలవు గదా! ఆ కరి వేలుపు, నరహరి నీ దరికి చేరితే మాకెరిగించి పుణ్యం కట్టుకో. ఓ పొగడలారా! పొగడదగిన వాని పొడ (రూపు) గాంచారా? ఓ మొల్లలారా! వెల్లి విరిసిన కీర్తిగల నల్లనయ్య ఏడ? ఓ కింశుకము- మోదుగ వృక్షములారా! శుకునిచే కీర్తింపబడిన కృష్ణమూర్తి ఎక్కడున్నాడో వక్కాణించండి. ఓ హరిణీ!- ఆడులేడీ! ఈడెరుంగని- సరిజోడు లేని వన్నెకాడిని- వెన్నుని నీవు కన్నట్లున్నది. నీకు పున్నెముంటుంది. వాని తెన్ను- జాడ తెలుపు.

కం॥ 'కిటియై కౌగిట జేర్చెను
వటుడై వర్ధిల్లి కొలిచె వడి గృష్ణుండై
యిట పద చిహ్నములిడె గ్రిం
దటి బామున నేమి నోచితమ్మ ధరిత్రీ!'

ఓ ధరా (భూ) దేవీ! కిటియై- వరాహమై నిన్ను కౌగిట జేర్చుకొన్నాడు. వటుడై- విశ్వరూపుడై పటుతరంగా- సమర్థతతో నిన్ను కొలిచాడు. ఇప్పుడు కృష్ణుడై కడుప్రేమతో నీ ఎడదపై అడుగులుంచాడు. పూర్వజన్మల్లో నీవెట్టి నోములు నోచావో?

శుకుడు- రాజా! ఇలా అడుగుచూ వ్రేతలు మన్మథ వికారంతో వేదురు- వెర్రి గొన్న మనసులు కలవారై మాధవ తాదాత్మ్యం పొంది ఆయన లీలలు అనుకరింపసాగారు. ఇదే లీలా శ్రవణ ప్రయోజనం! కేవల వాచా-మాటలకు పరిమితమైన అస్తికత వలన ఆస్తికులం కాలేము. భగవత్ సంయోగ వియోగాలలో సుఖదుఃఖానుభవమే ఈశ్వర అస్తిత్వ విశ్వాస లక్షణం. ఇట్లు తనువులు మరచి గోప తరుణులు బృందావనంలోని తరువులనూ, తీవలను దామోదరుని జాడ అడుగుతూ, చొరరాని అడవిదారుల్లో కమలం, ధ్వజం, హలం, కులిశం- వజ్రం, కలశం, అంకుశం ఇత్యాది శుభలక్షణాలచే మనోహరాలైన హరి చరణాలను గుర్తించి గొప్పగా చెప్పుకొంటూ తమలో ఒప్పుగా కనువిప్పుగా ఇలా అనుకున్నారు..

తంగిరాల
రాజేంద్రప్రసాద శర్మ
98668 36006

నీ॥ ఈ చరణంబులే యిందు నిభానన
సనకాది ముని యోగ సరణి నొప్ప
నీ పాద తలములే యెలనాగ
శ్రుతివధూ సీమంత వీధుల జెన్ను మిగులు
నీ పదాబ్జంబులే యిభకులోత్తమయాన
పాలేటిరాచూలిపట్టు గొమ్మ
లీ సుందరాంఘ్రులే యింటివరేక్షణ
ముక్తికాంతా మనోమోహనంబు
ఆ॥ 'లీ యడుగుల రజమె యింతి బ్రహ్మేశాది!
దివిజ వరులు మౌళిదిశల దాల్తు
రనుచు గొంద రబల లబ్జాక్షు డేగిన
క్రమము గనియు నతని గానరైర'

'ఓ చంద్రముఖీ! ఈ చరణాలే సనక సనందనాది మునీశ్వరుల ధ్యానమార్గంలో విరాజిల్లేవి. ఓ పడతీ! ఈ పాదాలే వేదాలనే వెలదుల- స్త్రీల పాపటపై వెలుగులీనేవి. ఓ గజరాజ గమనా! ఈ పదరాజీవాలే క్షీరసాగర తనయ అయిన లక్ష్మీదేవికి ఆధారాలు. ఓ ఇందీవరేక్షణా!- కలువ కంటీ! కెందామరల వంటి ఈ అందమైన అడుగులే మోక్షమనే మగువ మనసును మోహింపజేసేవి. ఓ పురంధ్రీ! ఈ పాదధూళియే పద్మజ (బ్రహ్మ) రుద్ర ఇంద్రాది సురవరులు శిరసున ధరించేది'- అంటూ కొందరు మానవతులు వనమాలి వెళ్లిన తెరువు కనుగొని కూడా అతనిని కానలేకపోయారు. ఆ సమయాన, పతులు సతులకు లొంగి- లోబడిపోయి పొందే దైన్యాన్ని, ప్రమదలు చూపే దౌర్జన్యాన్ని లోకానికి ఎరుక పరచడానికి శ్రీకాంతుడు ఒక కాంతామణితో విహరించాడు. లేనిచో ఆత్మారాముడు, పూర్ణకాముడు, అంతాతానే అయిన శాంతుడు, దాంతుడు శ్రీకృష్ణస్వామి ఒక కాంతతో సలిపిన వింతగొలిపే ఈ ఏకాంత క్రీడకి ఇక అర్థమేంటి, పై పరమార్థం కాక! అంతలోనే ఆ రమణి, తక్కిన తరుణు- స్త్రీలందరినీ వదలి వల్లభుడు తననే వలచి తన వద్దనే ఉన్నాడని విర్రవీగింది. ఆ గర్వంతోనే ఆ మత్తకాశిని- మదించిన స్త్రీ 'నేనిక నడచి రాలేను. నన్ను నీ మూపు- భుజంపై మోసుకొని పో' అని మొరాయించింది. అలా అన్నంతనే మురారి- కృష్ణుడు అంతర్ధానం చెందాడు. అప్పుడా తరుణి వేగుతూ- పరితపిస్తూ 'ఓ హరీ! ప్రాణేశ్వరా! రమణా! ఎక్కడికేగినావు? నీ చరణదాసినవుతా, నిలు' అంటూ విలపించింది. తరువాత కొందరు యువతులు ఆ సుదతిని చూసి 'మగని మన్నన చే మదించి ఈ మృగనయని ఇట్టి దుర్గతికి- అగచాట్లకు గురి అయింది' అని ఆశ్చర్యం పొందారు. ఇంతకీ ఎవరా బాధితురాలు? ఇంకెవరు? రాసేశ్వరి రాధాదేవే!

(సశేషం)

ఇస్లాం బోధ

మృదు భాషణం.. భూషణం

కత్తి చేసిన గాయం కాలంతో మానుతుందేమో గానీ, మాటలు చేసే గాయాలు ఎప్పటికీ మానవు అంటారు మన పెద్దలు. సంభాషణ, భావ వ్యక్తీకరణ మనిషికి దేవుడు అనుగ్రహించిన గొప్ప వరం. ఇతరులతో మాట్లాడే ముందు మన మాటలు సందర్భోచితమా, కాదా అని మనల్ని మనం ప్రశ్నించుకోవాలి. అవునని సమాధానం వస్తేనే సంభాషణ మొదలు పెట్టాలి. అనవసర మాటల వల్ల పాపాల్లో చిక్కుకునే ప్రమాదం ఉంది. అవసరమైన మంచి విషయాలైనా సందర్భానుసారంగానే మాట్లాడాలి. మేధావులు, మూర్ఖులతో వాదించకూడదు. నోటి దురుసుతనం ఉన్నవారు అవమానాల పాలవుతారు. ఒక వ్యక్తి హృదయం సరి కానంత వరకు అతడి విశ్వాసం సవ్యంగా ఉండదు. అతడి నోరు మంచిది కానంత వరకు అతడి హృదయం పవిత్రం కాదని ప్రవక్త బోధించారు. కాబట్టి సరైన మాటలే మాట్లాడాలి. లేదంటే మౌనంగా ఉండటమే ఉత్తమం. మనుషులు మధురంగా మాట్లాడాలని ఇస్లాం బోధిస్తుంది. మన భావాలు.. వినేవారి హృదయంలో నాటుకొనేలా ఉత్తమరీతిలో మాట్లాడాలి. ఉత్తమ సంభాషణ శత్రువులను సైతం ప్రభావితం చేస్తుంది. మృదు భాషణం అల్లాహ్ ప్రీతిని పొందే మార్గంగా అభివర్ణిస్తారు. నిరాధార, వినాశకర, అనవసర విషయాలు మాట్లాడకుండా నోటిని రక్షించుకోవాలని ఇస్లాం తన అనుయాయులను ఆదేశించింది. నిత్యం వాదోపవాదాలకు దిగే వ్యక్తిని దైవం మన్నించడు. 'మీ చూపుల్లో, మాటల్లో వినమత్రత చూపండి. ఇతరుల సంక్షేమాన్ని కాంక్షిస్తూ పలకరించండి' అన్న దైవప్రవక్త(స) ప్రవచనం మనందరికీ శిరోధార్యం. ప్రజలను సహృదయంతో పలకరించాలి అని చెబుతుంది ఖురాన్. 'మర్యాదగా పలకాలి, మృదువుగా సమాధానమివ్వాలి, అసత్యాలు పలకరాదు, రుజువాక్కును పలకాలి' ఈ సూక్తులన్నీ దివ్యఖురాన్ సుభాషితాలు. విశ్వాసులు ఖురాన్ ఆదేశించిన సూత్రాలను ఆచరిస్తారు. అల్లాహ్ ప్రీతిని పొందుతారు.

... ముహమ్మద్ ముజాహిద్
96406 22076

కథాసుధ

బ్రహ్మానందం

ఓ యువకుడు ఆనందం అంటే ఏమిటో తెలుసుకోవాలనుకున్నాడు. గురువును కలిస్తే తెలుసుకోవచ్చని మిత్రులు సలహా ఇచ్చారు. ఏ గురువును కలిస్తే బాగుంటుందా అని వెదకసాగాడు. అదే సమయంలో ఆ పట్టణానికి ఓ కొత్త గురువు రావడంతో సంతోషించాడు. అతణ్ని కలిసి ఆనందం అనేది ఎలా ఉంటుందో తెలియజేయమని కోరాడు. 'నీ కాలి చెప్పుల కొలత ఎంత?' అని ప్రశ్నించాడు గురువు. 'ఎనిమిది అంగుళాల'ని సమాధానమిచ్చాడు యువకుడు. 'ప్రస్తుతం నువ్వు వేసుకున్న ఎనిమిది అంగుళాల కొలత ఉన్న చెప్పులను పక్కన పెట్టు. ఏడు అంగుళాల చెప్పులు కొనుక్కో. వాటిని వేసుకుని ఊరంతా తిరిగి సాయంత్రం నా దగ్గరికి రా!' అని చెప్పి పంపాడు గురువు. ఆ యువకుడు ఏడు అంగుళాల చెప్పులు కొనుక్కుని కాళ్లకు తొడుక్కున్నాడు. నడుస్తున్న కొద్దీ ఇబ్బంది మొదలయ్యింది. అప్పుడప్పుడూ సరిగా నడవలేకపోయాడు. అయినా చెప్పులు విడిచిపెట్టకుండా తిరిగాడు. కాళ్ల నొప్పులు మొదలయ్యాయి. 'ఎప్పుడెప్పుడు సాయంత్రం అవుతుందా, చెప్పులను ఎప్పుడు విడిచిపెడదామా' అనిపించింది. ఎలాగోలా ఆ రోజు సాయంత్రం వరకు గడిపాడు. క్షణం ఆలస్యం చేయకుండా గురువు దగ్గరికి వెళ్లి ఏడుపు ముఖంతో ఆయన ఎదుట నిలబడ్డాడు. గురువు చిన్నగా నవ్వి ఏడు అంగుళాల చెప్పులను తీసి పక్కన పెట్టమన్నాడు. అలాగే చేశాడు యువకుడు. 'ఇప్పుడు ఎలా ఉంద'ని అడిగాడు గురువు. 'ఆనందంగా ఉంద'ని బదులిచ్చాడు యువకుడు. 'నెత్తి మీద ఉన్న కొండంత బరువును పక్కన తీసి పెట్టినట్లుగా ఉంది. సరైన కొలతలు ఉన్న చెప్పులు తొడుక్కోకపోవడం వల్ల చాలా ఇబ్బంది పడ్డాన'ని బాధపడ్డాడు. అప్పుడు గురువు.. 'మనం జీవితంలో కూడా ఇదే పొరపాటు చేస్తాం. సరైన చెప్పులు వేసుకోం. తప్పుడు కొలత జోళ్లు ఉపయోగిస్తున్నాం' అన్నాడు. ఆశ్చర్యంగా చూశాడు యువకుడు. 'మనకు ఉండాల్సిన మానవీయ విలువలను పక్కన పెడతాం. ధనం పట్ల ఆకర్షణ, వస్తువులపై వ్యామోహం, ఎదుటి వారి మన్ననల పట్ల మోజు, మనం గొప్ప అనే భావం మనసులో పెట్టుకుని జీవనం సాగిస్తుంటాం. కానీ, విలువలు వదలకుండా ఉన్నప్పుడే బ్రహ్మానందం లభిస్తుంది' అని ఆనంద రహస్యాన్ని వివరించాడు గురువు.

... ఆర్సీ కృష్ణస్వామి రాజు,
93936 62821

శనివారం సుబ్రహ్మణ్య షష్ఠి

షణ్ముఖనాథ.. వందనం

మార్గశిర శుద్ధ షష్ఠిని 'సుబ్రహ్మణ్య షష్ఠి'గా చేసుకుంటారు. దేవతలకు సేనా నాయకత్వం వహించి సుబ్రహ్మణ్యుడు తారకాసుర సంహారం చేసిన పర్వదినం ఇదే. కుమారస్వామి, కార్తికేయుడు, స్కందుడు, శరవణభవుడు అని సుబ్రహ్మణ్యుడికి పేర్లు. కుమారస్వామికి ఆరు ముఖాలు. కనుక షణ్ముఖుడని కూడా పేరు. ఆయన బుద్ధిని ప్రేరేపించే స్వామి. సుబ్రహ్మణ్య ఆరాధనతో మనోబలం లభిస్తుంది. బుద్ధి ప్రచోదనం అవుతుంది. సత్కర్మలు చేయడానికి ప్రేరణ కలుగుతుంది. సజ్జనుల క్షేమం కోసం ఆవిర్భవించిన సుబ్రహ్మణ్యుడు బుద్ధిని ప్రచోదనం చేస్తాడు. శక్తి కుమారుడికి ఇచ్చిన శూలాన్ని.. జ్ఞానశూలం అనడం వెనుక ఆంతర్యం కూడా ఇదే!

సుబ్రహ్మణ్యస్వామిని సర్పాలకు మూలదేవతగా భావిస్తారు. ఆయన వాహనం నెమలి. రెండు విరుద్ధ భావనలను, ధర్మాలను ఒక్కతాటిపై సమంగా నిలిపే శక్తి దైవానికి ఉంది. అందుకే నెమలి వాహనుడైన కుమారస్వామి సర్పాలకు అధిదేవతగా అనుగ్రహిస్తున్నాడు. అంతేకాదు, సుబ్రహ్మణ్యస్వామిని సంతాన కారకుడిగా, సంపత్తి దాతగా, ఆరోగ్య ప్రదాతగా భావిస్తుంటారు. స్వామి అనుగ్రహంతో ఇవన్నీ సిద్ధిస్తాయని విశ్వసిస్తారు. స్వామి అనుగ్రహం కోసం సుబ్రహ్మణ్య షష్ఠి నాడు పేదలకు దుప్పట్లు, కంబళ్లు దానం చేసే 'ప్రావరణ వ్రతం' నిర్వహించాలని పెద్దలు చెప్తారు. చలికాలంలో వచ్చే ఈ పర్వదినాన పేదల చలిబాధను నివారించడమే వ్రతంలోని ఆంతర్యం.

... శ్రీ